# కాగితం ముక్క

ఎముకలు కొరికే చలి...

ప్రభాకర్ ఇక ఒక్కడుగు ముందుకు వేయలేకపోయాడు. ఇటు అటు చూశాడు. పక్కన ఒక హోటల్ కనిపించడంతో పోయిన ప్రాణాలు లేచివచ్చిన ట్లనిపించిం దతనికి. గుక్కెడు వేడి వేడి కాఫీ గొంతులో పోసుకుంటేకాని, తను బసచేసిఉన్న లాడ్జికి చేరుకోలేను - అనుకుంటూ, మెల్లగా ఆ హోటల్లోకి ప్రవేశించాడు.

హోటల్ కట్టేసే టైము కావొచ్చింది కాబోసు — కుర్చీలన్నీ బల్లలమీద పేర్చబడి ఉన్నాయి. ఒక మూల మాత్రం రెండుమూడు టేబుల్స్ చుట్టూ ఖాళీ కుర్చీలున్నాయి. అటువైపు వెళ్ళమని ఒక సర్వర్ సైగచేశాడు. ప్రభాకర్ వెళ్ళి ఒక కుర్చీలో ఉస్సూరుమంటూ కూలబడగానే — ఆ సర్వర్ వచ్చి ఏం కావాలని అడిగాడు. "హాట్ కాఫీ!" అన్నాడు ప్రభాకర్. కాఫీ లేదనీ, టీ దొరుకుతుందనీ ఆ సర్వర్ వచ్చీరానీ ఇంగ్లీషులో అన్నాడు. "సరే — ఏదో ఒకటి పట్టుకురా," అని ప్రభాకర్ ఇంగ్లీషులోనే చెప్పాడు.

ప్రభాకర్‌కు ఇంకా వివాహం కాలేదు. మంచి ఆస్తిపరుడు. బి. యె. పూర్తిచేశాడు. తనకు కాలేజీలో గరపబడిన విద్యకన్నా — ఈ విశాల ప్రపంచంనించి నేర్చుకోవలసింది ఎంతో ఉందనే నమ్మకం గలవాడు. అంచేత, ప్రస్తుతానికి విదేశాలలో కాకపోయినా - స్వదేశంలోనే ఊరూర పర్యటించ నిశ్చయించాడు.

తమిళ రాష్ట్రంలోని వాడవాడలా తిరిగాక, ఇప్పుడు మలబారు చేరుకున్నాడు.

ఇక్కడి ప్రకృతి రామణీయకత, ప్రజల వేషభాషలు అతన్నెంతో ఆకర్షించాయి. తను చూసిన విషయాలన్నిటినీ మామూలుగా డైరీలో రాసుకున్నాడు. కాని, ఇక్కడి వాతావరణం మాత్రం తనకు అనుకూలంగా లేదు. అంచేత, త్వరలోనే ఏ మైసూరు రాష్ట్రానికో బయలుదేరాలని సంకల్పించాడు.

ఆవిరొస్తున్న టీ కప్పును సర్వర్ తెచ్చి, టేబుల్ మీద ఉంచేసి వెళ్ళిపోయాడు.

ఆ కప్పును ప్రభాకర్ పెదవులవద్ద ఉంచుకోగానే చుర్రుమనడం, అప్రయత్నంగా అతనిదృష్టి ఎదురుగా కొంతదూరంలో కూర్చొనున్న ఓ యువతిమీద పడడం ఒకేసారి జరిగిపోయాయి.

ఆ యువతి అక్కడ ఎంతసేపుగా కూర్చొనుందో ఏమో. ఆమెకు ఇరవైఏళ్ళకన్నా ఎక్కువ ఉండవు.

నల్లని వొత్తయిన జుట్టు. తీర్చిదిద్దినట్టున్న దట్టమైన నల్లని కనుబొమలు, నున్నని చెంపలు. పెద్దకళ్ళు. ఎర్రని పెదవులు. దానిమ్మగింజల్లాంటి పళ్ళవరస. కనీ కనిపించని — తిరిగీ తిరగని వొంటి వొంపులు. తెల్లని వాయిల్ చీర. తెల్లని సాటిన్ జాకెట్టు. తెల్లని మల్లెపువ్వులు. తెల్లని చెప్పులు, ముత్యాలగాజులు, ముత్యాల హారం, వెండి జుంకీలు... ఆ యువతి తెల్లగులాబీ పువ్వులా ఉంది.

ఆమె వంకే చూస్తూ, అలాగే మూర్ఛిల్లిపోతే ఎంత బావుణ్ణు — అనిపించింది ప్రభాకర్‌కు.

ఆమె ఖాళీచేసిన టీ కప్పును టేబుల్ మీద ఉంచి, జేబురుమాలతో పెదవులను మృదువుగా అద్దుకుంటున్నదల్లా — హఠాత్తుగా ప్రభాకర్ వంక చూసింది.

వెంటనే తన దృష్టిని ఆమెమీదినించి మరల్చా లనుకున్నాడు ప్రభాకర్. కాని, ఆ స్థితిలో తన కది సాధ్యం కానిపని అని తెలుసతనికి. అంచేతే వ్యర్థ ప్రయత్నం చేయలేదు.

ఇంతలో ఆ యువతి పెదవులమీద చిరునవ్వు తొణికిసలాడింది. ఆమె బుగ్గలు సొట్టబడ్డాయి.

అంతమాత్రానికే ప్రభాకర్ దేహం పులకరించింది; తనుకూడా మందహాసంతో జవాబివ్వా లనుకున్నాడు, కాని, ఊరుకొని ఊరు. అందులోనూ ఆ యువతి ముక్కూ ముఖం తను ఎరుగడు. అంచేత, తను అలాటి పిచ్చివేషాలేవైనావేస్తే, ఏం అఘాయిత్యం జరుగుతుందోనని మనసుకు కళ్ళెంవేసి బిగించాడు.

ఆ యువతిమాత్రం అతనివంకే చిరునవ్వుతో చూస్తోం దింకా. ఆమె అలా చూస్తున్నకొద్దీ అతను మరింత కొయ్యబారిపోసాగాడు.

అమాంతంగా ఆమె తనకేదో గుర్తుకువచ్చినట్లు, పక్కనున్న హేండ్‌బేగ్‌ను అందుకుంది. అందులోంచి ఒక నీలిరంగు కాగితం ముక్కను బయటకుతీసింది. పేనాతో దానిమీద ఏమో రాస్తూకూడా — రెండుమూడుసార్లు ప్రభాకర్ వంక క్రీగంటచూసింది.

ప్రభాకర్ గుండె జలదరించింది. తనుకూర్చున్న కుర్చీతోసహా గాలిలో ఎక్కడికో తేలిపోతున్న ట్లనిపించిం దతనికి.

ఇంతలో సర్వర్ ఒక సాసర్‌లో బిల్లుతీసుకొచ్చి ఆ యువతి ముందు ఉంచాడు. ఆమె అందులో 25 పైసలనాణెం పడేశాక, అతగాడు వెళ్ళిపోయాడు. పెన్‌ను హేండ్‌బేగ్‌లో పడేసి, ఆమె వొయ్యారంగా లేచి నిలుచుంది. ఒకసారి ఇటుఅటు చూసింది.

తర్వాత తన దృష్టిని ప్రభాకర్ వంక తిప్పింది. చిరునవ్వుతో తను రాసిన కాగితాన్ని నేలమీదికి జార విడిచింది. మరో నిమిషంలో హంసనడకలతో మెల్లగా ఆ హోటల్లోంచి బయటపడింది.

జి. వి. జి.

ఆ యువతి కనుమరుగయ్యాక తను ఏదో స్వప్నావస్థలోంచి తేరుకున్నట్లనిపించింది ప్రభాకరుకు.

ఆమె కాగితంముక్కలో ఏంరాసి ఉంటుంది ? వెంటనే తనను ఆ హోటల్ సమీపంగా ఎక్కడైనా వచ్చి కలుసుకోమని రాసి ఉంటుందా ? అలాంటిదే ఏదో రాసి ఉంటుంది. ఇక తను ఆలస్యం చేయకూడదు.

ఆత్రుతతో ప్రభాకర్ లేచాడు. అంత అందమైన మందహాసానికి తను ఆ విధంగానే ప్రత్యుత్తరం ఇవ్వలేకపోయినందుకు తన మగజన్మాన్ని ఓ వైపున నిందించుకుంటూనే — ఒక్క అంగలో వెళ్ళి, ఆ కాగితం ముక్కను అందుకున్నాడు. అతని గుండె వేగంగా కొట్టుకోవడంమొదలెట్టింది. మెల్లగా ఆ కాగితం వంక దృష్టి సారించాడు. వెంటనే కనుగుడ్లు తేలవేశాడు.

మలయాళం లిపి... ఆ అక్షరాలు గుండ్రంగా ముద్దులొలికేటట్లున్నాయే కాని, ఎంత బుర్రగోక్కున్నా — ఆభాష అతనికేం అర్థమౌతుందీ ? తనుకూడా మలయాళీ అనుకుందేమో ఆవిడ — పాపం... ఇప్పుడెలా ? ఈ పాటికి ఆమె చాలాదూరం వెళ్ళిపోయిఉంటుంది. వెంటనే తను పరుగుతీస్తే ? కాని, ఆ కాగితంలో ఆమె ఏం రాసిందో తెలీకుండా ఎలా వెళ్ళడం ?

ప్రభాకర్ మహా అవస్థలో పడిపోయాడు.

ఇంతలో సర్వర్ బిల్లును తీసుకొచ్చి ఇచ్చాడు. ఆ బిల్లుపైకంతో పాటు ఒక రూపాయనోటును సర్వర్ చేతిలో పెట్టాడు ప్రభాకర్. అతను సలాంపెట్టి వెళ్ళబోయాడు.

"ఏయ్ !"

సర్వర్ ఆగి, వెనుతిరిగి చూశాడు.

ప్రభాకర్ ఆ కాగితంముక్కను అందిస్తూ, తగ్గుస్థాయిలో "ఇదేమిటో చదివి చెప్పగలవా ?" అన్నాడు ఆంగ్లంలో.

సర్వర్ ఆ కాగితంవంక అలా చూశాడో — లేదో, క్రమక్రమంగా అతగాడి ముఖం ఎర్రబారింది. చివాలున ఆ కాగితాన్ని ప్రభాకర్ చేతికి అందించాడు.

అతని చిత్రవాలకానికి చకితుడౌతూ, "అందులో ఏముందో చదివి చెప్పవయ్యా — అంతే, అలా చురచుర చూస్తావేమిటి ?" అన్నాడు ప్రభాకర్.

ఆ సర్వర్ నిలువునా కంపించి పోతూ, "యూ ప్లీస్ గెటవుట్ !" అన్నాడు.

ప్రభాకర్ తృళ్ళిపడ్డాడు. "ఆఁ ! ఏమిటంటున్నావ్ ?"

"గెట్టవుట్ !"

"ఎందుకు ?" అన్నాడు ప్రభాకర్ పెదవులు చప్పరిస్తూ.

"గెటవుట్ !" అని ఆ సర్వర్ మళ్ళీ గాండ్రిస్తూ, ఇందాక తను పుచ్చుకున్న రూపాయ నోటును ప్రభాకర్ ముఖంమీదికి విసిరేశాడు.

ప్రభాకర్‌కు దాదాపు మతిపోయినంత పనైంది. "నీ కేమైనా మతిపోయిందా ?" అని తానుకూడా రెట్టించి అనా లనుకున్నాడే కాని, అందుకు ధైర్యం చాలిందికాదు. మరోక్షణంలో ఆ సర్వర్ తన గొంతు పట్టి బయటకు గెంటేటట్టున్నాడు. ఇక తనక్కడ అట్టే సేపు ఉంటే మర్యాద దక్కదని, ఆ సర్వర్‌ను లోలోన తిట్టుకుంటూ, 'బ్రతుకుజీవుడా' అని ఆ హోటల్లోంచి బయటపడ్డాడు.

ఆగి, చేతనున్న ఆ కాగితంముక్కవంక ఒకసారి అయోమయంగా చూశాడు. అందులోని అక్షరాలు ఈ మారు అతన్ని వెక్కిరించిన ట్లనిపించింది. దాంతో అతని ముఖం జేవురించింది. ఆ కాగితాన్ని మడిచి కోటుజేబులో ఉంచుకొని, వడివడిగా నడక సాగించాడు.

ఎంత దూరం వెళ్ళినా—ఆ యువతి మాత్రం కనిపించలేదు. అయినా, ప్రభాకర్ నిస్పృహ చెందలేదు. ఆ కాగితంలో ఆమె ఏం రాసిందో తెలుసుకోవాలన్న ఆదుర్దా మటుకు అంత కంతకు పెచ్చు పెరిగి పోసాగింది.

గాలికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొబ్బరిచెట్ల ఆకులు గలగలమంటున్నాయి. వెలుగు పోతోంది. చీకటి పడబోతోంది. ఎదురుగా మనిషి మాత్రుడు కనిపించడం లేదు. అంత చలిగాలిలోనూ ప్రభాకర్ వొళ్ళంతా చెమటపట్టేసింది ఆయాసంతో కాళ్ళీడ్చుకుంటూ, మరో అరగంటలో తను బసచేసిఉన్నలాడ్జికి ప్రయాసతో చేరుకున్నాడు. కౌంటర్ ముందు కుర్చొని, నోట్లు లెక్కెడుతున్న ఆ లాడ్జిమేనేజర్ తల ఎత్తాడు. చిరునవ్వుతో "ఓహో, మీరా ? రండి—రండి...ఎలా ఉంది, సార్, ఈ ఊరు ?" అని అడిగాడు ఆంగ్లంలో.

ప్రభాకర్ ఆ ప్రశ్నకు జవాబియ్యలేదు. ఒకసారి ఇటు అటు చూసి, మెల్లగా తన జేబులోంచి ఆ కాగితాన్ని బయటకు తీశాడు. "దయచేసి ఇందులో ఏముందో కాస్త చదివిచెప్తారూ ?" అంటూ దాన్ని వినమ్రంగా అందించాడు.

లాడ్జి మేనేజర్ నొసలు చిట్లించాడు. చూస్తూండగానే అతని ముఖం పాలిపోయింది. కనుగుడ్లు బయటకు పొడుచుకు వచ్చేటట్లయింది. అసహ్యంగా చూస్తూ, ఆ కాగితాన్ని ప్రభాకర్ ముఖం మీదికి గిరవాట్టేశాడు. "వెంటనే మీరు మా లాడ్జిని ఖాళీచేసి వెళ్ళిపొండి."

ప్రభాకర్ నీళ్ళు నములుతూ, "సంగ తేమిటో చెప్పండి," అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

లాడ్జి మేనేజర్ విసురుగా తల పక్కకు తిప్పి, "ఏయ్, గూర్ఖా! ఎక్కడ చచ్చావ్ ? ఈయన గదిలోని పెట్టె బేడా తెచ్చి బయట పారెయ్ !" అని అరిచాడు.

దాంతో ప్రభాకరుకు తల తిరిగిపోయిన ట్లయింది ఆ లాడ్జి మేనేజరు వంక తీక్షణంగా చూస్తూ, తన గదికేసి వడివడిగా వెళ్ళి

పోయాడు. వెంటనే గదిని ఖాళీచేసి, తన సామానులతో బయట పడ్డాడు.

ఇక తను ఆ ఊళ్ళో ఉండకూడ దనుకున్నాడు, ఐతే, ఆ ఉత్తరం అంతు మాత్రం తేల్చుకోవా లనుకున్నాడు. అంచేత, దాన్ని కోట్ జేబులోనే భద్రంగా దాచుకొని, ఒక జట్కాలో స్టేషన్‌కు చేరుకున్నాడు. మద్రాసుకు టికెట్ కొన్నాడు.

ఇంతలో ప్లాట్‌ఫామ్ మీదికి ట్రయిన్ వచ్చి ఆగింది. ఒక పోర్టర్‌చేత తన పెట్టీ బేడా మోయించుకొని, ఒక కంపార్టుమెంటులోకి చేరాడు. పోర్టర్‌కు కూలీడబ్బులు ఇవ్వడానికి మనీ పర్సు తెరవబోతూ, "నువ్వు మలయాళం చదువగలవా ?'' అన్నాడు. ఆ పోర్టర్ తల ఊపగానే, ప్రభాకర్ తన కోట్ జేబులోంచి ఆ నీలంరంగు కాగితం ముక్కను తీసి అందిస్తూ. "ఐతే, చదివి చెప్పు...నీకు మాంచి బక్షీస్ ఇస్తా.'' అన్నాడు.

ఆ పోర్టర్ ఆ ఉత్తరాన్ని సాంతం చదివాడో లేదో, తల వాల్చేశాడు. దాన్ని మడిచి ప్రభాకర్ చేతికిస్తూ. "దీన్ని మరెవరికీ చూపించకండి,'' అన్నాడు హిందీలో. అంతే! భయం భయంగా చూస్తూ, గిరుక్కున వెనుతిరిగాడు. తన కూలీడబ్బులైనా పుచ్చుకోకుండా అమాంతంగా ఆ కంపార్టుమెంటు లోంచి బయటకు దూకాడు.

చేతిలో ఉన్న ఆ కాగితంముక్క వంకే ప్రభాకర్ పిచ్చివాడిలా చూస్తూండిపోయాడు. ఇంతలో బండి కదిలింది.

ప్రభాకర్ ఇక సరాసరి తన స్వగ్రామానికే చేరుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఆ ఊళ్ళో రామన్ నాయర్ అనే తెలుగు తెలిసిన మలయాళీ ఉన్నాడు. అతన్ని కలుసుకొని, ఆ ఉత్తరంలోని విషయం ఏమిటో తెలుసుకుంటేగాని, మళ్ళీ పర్యటనకు బయలుదేరకూడదని దృఢంగా నిర్ణయించుకున్నాడు.

అలాగే తన స్వగ్రామంలో ట్రెయిన్‌నించి ప్రభాకర్ దిగగానే ఏకాఏకీన సైకిల్‌రిక్షాలో తిన్నగా ఆ నాయర్ ఇంటికే చేరుకున్నాడు. అతన్ని చూడగానే, ''హమ్మయ్య, నువ్వు ఇంట్లో ఉంటావో లేదో అనుకున్నా. నా నెత్తిన పాలుపోశావ్ ?'' అన్నాడు.

"అది సరే...ఏమిటిలా ఎక్కడ్నించి అమాంతంగా ఊడిపడ్డావ్ ?"

ఈ కుశల ప్రశ్నలన్నీ తర్వాత..."ముందు నీకొక ఉత్తరం ఇస్తాను. అది మీ మలయాళం భాషలో రాయబడింది, అందులో ఏముందో నువ్వు పూర్తిగా చదివి చెప్పాలి."

"అలాగే... దానికింత ఖంగా రెందుకోయ్, ప్రభాకర్ ?"

"ఐతే, ఒక షరతు. ఆ ఉత్తరం చదివి నువ్వు కోప్పడకూడదు."

''అంటే ?"

''నన్ను చూసి అసహ్యించుకో కూడదు."

"ముందే చెప్పేస్తున్నా...ఆ ఉత్తరం చూసి నువ్వు భయపడకూడదు. అందులో ఏం రాసి ఉందో వివరంగా తర్జుమా చేసి చెప్పాలి."

"ఏమిటా ఉత్తరం ? నీ వాలకం చూస్తుంటే, నాకిప్పుడే భయం పట్టేటట్లుంది సుమా !"

''అలాగేం ?" అంటూ ప్రభాకర్ తీక్షణంగా చూశాడు. తల పంకిస్తూ, ''ఈ విషయంలో నిన్నుకూడా నమ్మలేను. కాస్త ఆగు!" అంటూ తన పెట్టె తెరిచి, అందులోంచి పిస్టల్‌ను బయటకు తీశాడు.

దాన్ని చూడగానే నాయర్‌గుండె తారెత్తిపోయింది. "యిదేమి ట్రోయ్ !" అని ఒక్క గావుకేకెట్టబోయాడు.

"ఉష్...మెల్లగా మాట్లాడు. నువ్వు నాకు ఎంతటి ఆప్త మిత్రుడివైనా కావొచ్చు. కాని, ఆ ఉత్తరంలో ఏముందో నువ్వు చెప్పకపోతే, నిజంగా నీ ప్రాణాలు దక్కవు."

"చదివి చెప్తానన్నాగా ? దానికింత గొడవెందుకూ ?''

''జాగ్రత్త ! '' అంటూ ప్రభాకర్ పిస్టల్‌కొనను నాయర్ గుండెకు గురిపెట్టి, ''ఇందులోని తూటాలు రివ్వున నీ గుండెలోకి దూసుకుపోకుండా చూసుకో !" అన్నాడు.

నాయర్‌కు పాదాలకిందభూమి కంపించిపోతున్నట్లుంది. ఏడుపు ముఖంపెట్టి, "ఇంతకీ ఏదీ ఆఉత్తరం ?" అన్నాడు.

"ఇస్తా...చదివి చెప్పకపోతే ఏమౌతుందో తెలుసుగా ?'' అంటూ ప్రభాకర్ తన ఎడమచేతిని కోట్‌జేబులోకి పోనిచ్చాడు. ఉలిక్కిపడ్డాడు. గాభరాతో ఆకోట్‌కు ఉన్న తతిమ్మా జేబులన్నీ కూడా వెతికాడు. ఆఖరికి పాంట్‌జేబులు, తన పెట్టేబేడా — అన్నిట్లోనూ గాలించాడు. అతనికి తెలీకుండానే అతని కుడిచేతిలోంచి పిస్టల్‌జారి కింద పడిపోయింది. ''పోయింది ... ఆ ఉత్తరం ఎక్కడో పోయింది," అని తలను చేత్తోపట్టుకొని, అక్కడే కూలబడిపోయాడు పిచ్చివాడిలా.

నాయర్ దిగ్భ్రమతో — తెరిచిన నోరుమూయకుండా — కొన్ని నిమిషాలపాటు అలాగే చూస్తూండిపోయాడు తన మిత్రుడివంక...

